# దోసెడు ఆకలి

మా ఆఫీసుకు దగ్గర దారి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి మీంచి అడిక్‌మెట్ ఫ్లయి ఓవర్. హిందీ మహా విద్యాలయం నుండి ఫ్లయిఓవర్ వరకు చేరుకుంటే చాలు, అక్కడ్నించి దారి సుగమంగా ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీలోంచి దారి మూసివేయడం వలన అడిక్‌మెట్ మీదుగా వెళ్ళడం తప్పనిసరి అవుతోంది. మా ఆఫీసు హబ్సిగూడాలో ఉంది. వేరే దారి ఉంది కాని అది చుట్టూ అవుతుంది.

ఇబ్బందల్లా ఈ దారి ఇరుకుగా ఉంటుంది. కారు నడపడం తేలికగా అనిపించదు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం

వలన ఎప్పుడేం జరుగుతుందో అర్థం కాకుండా ఉంటుంది. దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి వాళ్ళు, నల్లకుంట పోలీస్ స్టేషన్‌వాళ్ళు ఫుట్‌పాత్‌లను తమ సొంత జాగీరులా ఆక్రమించేసుకున్నారు. స్కూటర్లు, మోటార్‌బైక్‌లు మనిషి పట్టే సందుంటే చాలు, దూసుకువెళ్ళిపోతుంటాయి. నేనీమధ్యలో ఇబ్బందిపడని రోజు లేదు. ఫ్లయిఓవర్ చేరుకోవడానికే చాలా సమయం పడుతుంటుంది.

ఆరోజు ఉదయం ఇంటినుండి ఆఫీసుకు ఎంత త్వరగా బయల్దేరదామనుకున్నానో అంత ఆలస్యమయింది. తొమ్మిదింటికల్లా ఆఫీసులో ఉండవలసిన వాడిని పదకొండు కావస్తున్నా నా కారు దారిలోనే ఉంది. గజం కదలడానికి అయిదు నిమిషాలకన్నా ఎక్కువే పడుతోంది. ప్రతి అడుగుకు చిరాకు, విసుగు ఎక్కువవుతోంది.

రాత్రి నాతో ఎంతో బావున్న నా భార్యకు ఉదయాన్నే ఏమయిందో, ఏమో నేను త్వరగా లేచి ఆమెను లేపి బెడ్‌కాఫీ ఇచ్చినప్పుడు మంచంమీదే కూర్చుని కాఫీ తాగింది. ఎంత వేడి కాఫీ అయినా మూడు నాలుగు గుక్కల్లో తాగేస్తుంది. పావుగంట దాటాక ఏమయిందో ఏమో నా మీద చిర్రుబుర్రులాడడం మొదలెట్టింది. ఆమె కోపానికి కారణం ఏమీ ఉండదు. నా మీద అరవడం మామూలు విషయం. పట్టించుకోను. పట్టించుకోకపోవడం వలన కూడా ఆమె కోపం ఎక్కువ అవుతుంటుంది. నాకామె అర్థం కాలేదో, నేనామెకు అర్థం కాలేదో తెలుసుకోకముందే ఇద్దరు పిల్లలకు తల్లిదండ్రులమయ్యాం. మా నాన్న నన్ను అర్థం చేసుకోవడానికి నలభయి సంవత్సరాలు తీసుకున్నాడు.

విద్యానగర్ క్రాస్‌రోడ్డు దాటి కారు అడిక్‌మెట్ వైపు మళ్ళించాను. ఎండాకాలం కాకపోయినా అప్పటికే ఎండ ఎగబాకి ఉంది. నా కారుకు ఎ.సి. ఉన్నా పనిచేయడం లేదు. రెండుమూడుసార్లు బాగుచేయించినా మొరాయించడం మానలేదు. చెమట పడుతోంది. పక్క సీట్లో ఉన్న తువాలు అందుకుని ముఖం, మెడకు పట్టిన చెమట తుడుచుకున్న వెంటనే తిరిగి చెమట పట్టడం మొదలవుతోంది. గాలితోపాటు ట్రాఫిక్ బిగుసుకుపోతోంది. అటుపక్క నుండి బళ్ళు బాగానే వస్తున్నాయి. మా వైపు నుండి వెళ్ళే బళ్ళకే ఇబ్బంది అవుతోంది. పక్కకు మళ్ళించడానికి వీలు కావడం లేదు.

బళ్ళు ఎయిర్ టయిట్‌గా ఉన్నాయి. కొంపలంటుకుపోతున్నట్టు ముందున్న కారు, వెనుకున్న కారు వాళ్ళు ఉండుండి హారన్లు వాయిస్తున్నారు. మాకు కొద్ది

దూరంలో ట్రాఫిక్ పోలీసు రోడ్డు మధ్యలో నిలబడి చేతులు ఊపుతున్నాడు. రమ్మంటున్నాడో, వెళ్ళిపొమ్మంటున్నాడో అర్థంకావడం లేదు.

టై వదులుచేసుకుని, కోటు విప్పి వెనక సీట్లో పడేశాను. ఉక్కకు చొక్కాలో కొంత భాగం తడిచిపోయింది. ఆ వేళ ఎందరో డెలిగేట్స్ ముందు నేనో పేపర్ ప్రజంట్ చేయాలి. మా చీఫ్, మిగతా వారంతా నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఈ అవకాశం తప్పిపోతే మళ్ళీ వస్తుందనే నమ్మకం లేదు. ప్రమోషన్‌కు గండిపడుతుంది. తొందరగా బయల్దేరి రావడంలో సెల్‌ఫోన్ ఇంట్లోనే మర్చిపోయాను. ల్యాప్‌టాప్, ప్రజంట్ చేయాల్సిన పేపర్లు తెచ్చుకున్నాను. ఈసరికి మా ఆఫీసు వాళ్ళు నాగురించి నా భార్యకు ఫోను చేసి ఉంటారు. నేను ఇంటినుండి బయల్దేరి చాలాసేపయిందని చెప్పి ఉంటుంది.

నా పరిస్థితి ఊహించుకునేకొద్దీ నా మీద కోపం ఎక్కువవుతోంది. అదేమిటో గాని ఉదయం నుండి ఏం చేసినా సవ్యంగా జరగడం లేదు. స్కూల్లో పిల్లల్ని వదిలి పెట్టడానికి వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు నా కారును మూడు కార్లకు తాకించబోయాను.

కొట్టేశాననే అనుకున్నాను. మరో ఆటోను గుద్దేయబోయాను. ఆ ఆటో నిండా పిల్లలున్నారు. స్కూలుకు తీసుకువెళ్తున్నట్టుంది.

ఆటో నడుస్తోంది కాని ఆటో డ్రైవరు మటుకు కనిపించలేదు. పిల్లల పుస్తకాల సంచుల మధ్య ఎక్కడో ఉండి ఉండాలి. ఏదయినా జరిగి ఉంటే పెద్ద గొడవే జరిగి ఉండేది. వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను.

కారు నత్తనడకన కదులుతోంది. ఇంకో అర ఫర్లాంగులో ఫ్లయిఓవర్ మొదట్లో ఉంటాను. అది దాటిన పావుగంటలో మా ఆఫీసులో ఉంటాను.

విద్యానగర్ క్రాస్‌రోడ్డు నుండి గమనిస్తున్నాను. నా కారుకు అవతలి పక్కగా నా కారంత నెమ్మదిగా నడుస్తున్నాడు. అతనికి అరవై అయిదేళ్ళు ఉండొచ్చు. చామనచాయలో పొడుగ్గా సన్నగా ఉన్నాడు. గడ్డం మాసిపోయి ఉంది. పాతబడిన చొక్కాకు అక్కడక్కడా నూనె మరకలున్నాయి. కాళ్ళకు ఆకు చెప్పులున్నాయి. బిచ్చగాడిలా అనిపించడంలేదు. ముందుకు వెళ్ళేందుకు నేనెంత తొందరపడుతున్నానో రోడ్డు దాటేందుకు అతనంత తొందరపడుతున్నట్టనిపిస్తోంది. మూడు నాలుగుసార్లు నా కారు దాటి ముందుకు వెళ్ళాడు. వీలు కాలేదేమో వెనక్కి వచ్చేశాడు. నా కారు పక్కనే నడుస్తూ ఏ కొద్ది అవకాశం చిక్కినా కారు నుండి తప్పించుకుని రోడ్డు దాటుదామని

ఉందనుకుంటాను. నా మీద నాకు కడుపునిండిన కోపంతో, ఉదయం నుండి ఖాళీగా ఉన్న ఆకలితో అతను నా కారు దాటడానికి అవకాశం ఇవ్వదల్చుకోబుద్ధి కావడంలేదు.

కార్లు బంపర్ టు బంపర్‌గా నడుస్తున్నాయి. అతను కొద్దిసేపాగితే ట్రాఫిక్ పలచనవుతుంది. అతను ఏ ఇబ్బంది లేకుండా రోడ్డు దాటొచ్చు. అంత తొందర పడకపోతేనేం?

నేను చూపు రెండు క్షణాలపాటు మళ్ళించగానే నా కారు ముందు మనిషి పట్టేంత దారి ఎప్పుడు చూశాడో మధ్యలోకి వచ్చి నా కారును సగం పైగా దాటాడు. మరో మూడు అడుగులు వేస్తే అవతలకు వెళ్ళిపోతాడు. బ్రేక్ మీంచి కాలు తీసేశాను.

అనుకోలేదు. అతనికి కారు గట్టిగానే తగిలింది. వెనక్కి పడిపోయాడు. కారు ఆపి తలుపు తెరుచుకుని అతని దగ్గరకు వచ్చాను. చిన్నగా మొదలయిన భయం క్రమంగా ఎక్కువ కాసాగింది. దెబ్బ ఎక్కడ తగిలిందో అర్థం కావడంలేదు. కాలు మడత పడింది. చేతులు గీరుకుపోయాయి.

ముక్కులోంచి రక్తం కారుతోంది. పాదచారులు మా చుట్టూ చేరుకుంటున్నారు. నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. ట్రాఫిక్ పోలీస్ వచ్చి నా కారులోకి వంగి కారు తాళాలు తీసుకున్నాడు. ఏం జరగబోతుందో నేను ఊహించలేకపోతున్నాను.

అతని చేతిలో ఉన్న పాలిథిన్ కవర్ రోడ్డు మీద పడి పగిలి, పప్పూ, అన్నం చిందరవందర అయింది. అది అతను గమనించినట్టు లేదు. రెండో చేతిలోని చిల్లర అటూ ఇటూ పడిపోయాయి.

ముందుకు వంగి అతని తల పట్టుకున్నాను. అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.. నా చేయి వణుకుతోంది. ఇటువంటి సంఘటన నాకు ఎప్పుడూ ఎదురు కాలేదు. జేబులోంచి రుమాలు తీసి కారుతున్న రక్తాన్ని తుడుస్తోంటే,

“బాబూ, నా ముసల్ది... నా భార్య... ఇంట్లో ఏమీ లేక రెండు రోజుల నుండి అన్నం తినలేదయ్యా... ఇదో ఈ కుడిపక్క సందు చివర్లోనే మా ఇల్లు... నువ్వేమనుకోకపోతే ఈ కవరులోని అన్నం దానికివ్వగలవా?... మాట... నేను కారు కిందపడినట్టు దానికి చెప్పొద్దు... చచ్చిపోతుంది” అన్నాడు.

***ఆదివారం 'వార్త', 24 జూన్, 2012***